క్లుప్తంగా

ఎంపీ బోస్‌ను కలసిన ముదునూరి



ఎంపీ బోస్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న మురళీ కృష్ణంరాజు

రామచంద్రపురం రూరల్: వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్‌ను నరసాపురం పార్లమెంటు వైఎస్సార్ సీపీ పరిశీలకుడిగా నియామకం పొందిన ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన నాయకుడు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీ కృష్ణంరాజు ఆదివారం మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎంపీ బోస్ మురళీ కృష్ణంరాజుకు అభినందనలు తెలిపారు. పార్టీ బలోపేతానికి అనుసరించాల్సిన విధానాలపై వారు కాసేపు మాట్లాడుకున్నారు.

దర్శకుడు దాసరికి ఘన నివాళి

కపిలేశ్వరపురం (మండపేట): జనాన్ని జాగృతం చేసిన గొప్ప దర్శకుడు దాసరి నారాయణరావు అని మండపేట మండలం ఏడిదలోని డాక్టర్ దాసరి నారాయణరావు భవన్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ కామన ప్రభాకరరావు అన్నారు. దాసరి 78వ జయంతిని ట్రస్టు భవనంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత దాసరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కామన మాట్లాడుతూ దాసరి నారాయణరావు 160 సినిమాలకు దర్శకత్వం వహించడమే కాకుండా జనాన్ని మేల్కొల్పే పాత్రలను పోషించిన కళాకారుడన్నారు. సినిమా ఇండస్ట్రీకి పెద్ద దిక్కుగా వ్యవహరించడమే కాకుండా పత్రిక, రాజకీయ రంగాల్లో రాణించి సాధ్యమైనంత సేవ చేశారన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పి.సత్యనారాయణ, వి.బాబూరావు, సీహెచ్ బాబీ, ఎం.శ్రీను, వి.చిన్నా, జి. సురేష్ పాల్గొన్నారు.

కవులకు సత్కారం



రాజమహేంద్రవరంలో సత్కారం అందుకుంటున్న స్వామి ప్రసాద్

కపిలేశ్వరపురం (మండపేట): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అంబేడ్కర్ సేవా కేంద్రం ఆధ్వర్యంలో సాహిత్య రంగంలో కృషి చేస్తున్న కవులు, రచయితలను సత్కరించారు. మండపేట మండలం ద్వారపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల పీఎస్ ఉపాధ్యాయుడు, అరసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు గండి స్వామి ప్రసాద్‌ను రాజమహేంద్రవరంలో ఆదివారం పూలమాల, శాలువాతో సత్కరించారు. ఆయనను పాఠశాల హెచ్‌ఎం సవితాల సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు బండారు రాము, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ చల్లా రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, కవి తూలూరి నరేంద్ర అభినందించారు.

ఎలక్ట్రీషియన్, ప్లంబర్స్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం

కాజులూరు: ఆర్యావటంలో ఆదివారం జరిగిన మండల ఎలక్ట్రీషియన్, ప్లంబర్స్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. సంఘం సీనియర్ నాయకుడు రేఖపల్లి సత్తిబాబు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎన్నిక అనివార్యమవగా సంఘం అధ్యక్షుడిగా ఇంత అప్పారావు, ఉపాధ్యక్షుడిగా పెంకే అప్పారావు, కార్యదర్శిగా మాత సత్తిబాబు, సహాయ కార్యదర్శిగా ఆర్.సత్తిబాబు, ట్రెజరర్‌గా నరాల వీరబాబు, కార్యవర్గ సభ్యులుగా చందాల వీరబాబు, కురుపూడి దొరబాబు తదితరులను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నిత్యం సభ్యులకు అందుబాటులో ఉంటూ సంఘ అభివృద్ధికి నిరంతరం పాటుపడతామని నూతన కార్యవర్గం ప్రతిజ్ఞ చేశారు.

తగవు తీరుస్తామని పిలిచి దాడి

రామచంద్రపురం రూరల్: తన భార్య, తనకు మధ్య వచ్చిన తగాదాను తీరుస్తామని పిలిచి తనపై దాడి చేశారంటూ అమలాపురానికి చెందిన బొలిశెట్టి మణిశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ పోలీసులు ఆదివారం విలేకరులకు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మణిశంకర్, భార్యల మధ్య కుటుంబ తగాదాలు తీరుస్తామని తనను పిలిపించారని తెలిపారు. తగవు తేలకపోవడంతో వెంకటాయపాలేనికి చెందిన తోట రాము, నారాయణరావు, చోడాబత్తుల రవిలు మణిశంకర్‌ను పశువుల శాల వద్దకు తీసుకువెళ్లి దాడి చేసి గాయపరిచారని, అనంతరం కారులో ఎక్కించుకుని అంబాజీపేటలో భార్య వద్దకు తీసుకువెళ్లారని, ఆ తరువాత అంబాజీపేట పోలీస్‌స్టేషన్ వద్ద వదిలి వేసినట్లు బాధితుడు తెలిపాడు. మణిశంకర్ తన మావయ్య శ్రీనివాస్‌కు ఫోన్ చేయగా అతడు వచ్చి అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చేర్పించినట్లు పేర్కొన్నారు. ఆసుపత్రి సమాచారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ద్రాక్షారామ పోలీసులు తెలిపారు.

అకాల వర్షం.. అపార నష్టం

- నియోజకవర్గంలో 4.3 మిల్లీ మీటర్ల వర్షపాతం
- తడిసి ముద్దయిన ధాన్యం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



కాజులూరులో ఈదురు గాలులు, భారీ వర్షానికి నేలకొరిగిన వరిచేను

కపిలేశ్వరపురం: విపత్తు రైతు వెన్ను విరుస్తోంది. మరో 10 రోజులు ప్రకృతి సహకరిస్తే మూడు నెలల కష్టార్జితం చేతికందేది. అకాల వర్షాలు అన్నదాతలను నట్టేట ముంచాయి. ఇప్పటి వరకూ ప్రభుత్వమే తమపై కక్ష కట్టిందనుకొంటున్న రైతు ఇప్పుడు ప్రకృతిపైనా నిట్టూరుస్తున్నాడు. రబీ సాగులో ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం పెట్టుబడి సాయం చేయకపోయినా అష్టకష్టాలు పడి పంటలను సాగు చేశారు. ఏప్రిల్ మూడో వారంలో వర్షాలు పడినా అష్టకష్టాలు పడి పంటను కాపాడుకున్నారు. కాగా ఆదివారం ఉన్నట్టుండి నియోజకవర్గంలోని మండపేట, రూరల్ గ్రామాలు, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల్లో భారీ వర్షం కురిసింది. 70 శాతం రబీ పంట ఒబ్బిడి అయ్యినప్పటికీ ఇంకా 30 శాతం పంట క్షేత్రంలోనే ఉండిపోయింది. మరో వారం రోజుల వర్షాలు కురవకపోతే నూరు శాతం పంట చేతికందేది. 4.3 మిల్లీ మీటర్లు వర్షం కురిసింది. కపిలేశ్వరపురం మండలంలోని అంగర, నిడసనమెట్ట, వాకతిప్ప, పడమర ఖండ్రిక, టేకి గ్రామాల్లో అత్యధికంగా పంట పొలంలో ఉండిపోయింది. యంత్రంతో కోత కోస్తుండగా వర్షం పడిన చోట రైతులు కోత పనులను నిలిపివేశారు. ఇప్పటికే కోసి రహదారులు, గ్రామాల వీధులు, వ్యవసాయ క్షేత్రాల్లోని మట్టిదిమ్మలపై ఆరబెట్టిన రైతులు బరకాలతో కప్పి ధాన్యాన్ని కాపాడుకొనే ప్రయత్నం చేశారు.

పంటను ఇలా కాపాడుకోండి

వర్షం నేపథ్యంలో వరి పంటను కాపాడుకొనే పద్ధతులపై కపిలేశ్వరపురం వ్యవసాయ శాఖాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ పలు సూచనలు చేశారు. వర్షం కురిసే అవకాశం ఉంటే వరి కోతలు వాయిదా వేసుకోవాలి. పంట కోయని చేలోకి నీరు చేరి ఉంటే నీరు బయటకు పంపేందుకు శాస్త్రీయ పద్ధతిలో బాటలు వేసుకోవాలి. ధాన్యం రంగు మారకుండా ఉండటానికి కార్బెండియాజిమ్‌ను లీటరు నీటిలో 1 గ్రాము, లేదా లీటరు నీటిలో రెండు గ్రాముల కార్బెండియాజిమ్, మాంకోజెబ్‌లను పంటపై పిచికారీ చేయాలి. గాలికి ఒరిగిపోయిన పంటను కోసేందుకు వీలుగా వరి కంకులను నిలబెట్టి కట్టలుగా కట్టాలి. అలా చేయడం వల్ల ధాన్యం రంగు, నాణ్యత మారవు. పూర్తిగా ఎండని వరి పనలను కుప్పగా వేసేటప్పుడు ఎకరానికి 25 కిలోల ఉప్పు చల్లిన తర్వాత కుప్ప వేసుకోవాలి. నూర్పిడి చేసిన ధాన్యం తడిసిన ధాన్యాన్ని కచ్చితంగా మూడు రోజులు పాటు ఎండలో ఆరబెట్టాలి. అలా చేయకపోతే ధాన్యం మొలకెత్తడమే కాకుండా, రంగు మారి దుర్వాసన వచ్చే ప్రమాదం ఉంది. ఎండబెట్టడం సాధ్యం కానప్పుడు క్వింటాల్ ధాన్యానికి ఒక కిలో ఉప్పు, 20 కిలోల ఎండిన పొట్టు, గడ్డిని వేయాలి. రంగు మారిన ధాన్యాన్ని ముడి బియ్యంగా కాకుండా ఉడకబెట్టిన బియ్యంగా అమ్మడం ద్వారా నష్టాన్ని కొంతవరకు తగ్గించవచ్చు.

రైతన్న గుండెల్లో గుబులు

కె.గంగవరం: ఏటా ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు నష్టపోతున్నారు. ఈ ఏడాది పంట ఆశాజనంగా ఉన్న తరుణంలో ఇప్పడు ప్రకృతి కన్నెర్ర చేస్తుందోమోనని రైతులు కలవరపడుతున్నారు. ధాన్యాగారమైన రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం మండలంలో 6308 హెక్టార్లు, రామచంద్రపురం మండలంలో 6000 హెక్టార్లు, కాజులూరు మండలంలో 7200 హెక్టార్లలో ఈ ఏడాది రైతులు వరి సాగు చేశారు. ప్రస్తుతం వరి పంట నియోజకవర్గంలోని మూడు మండలాల్లో కోత దశలో ఉంది. సుమారుగా 40 శాతం పంట కోత కూడా కోసి ధాన్యాన్ని రోడ్లమీద, పొలం గట్లపై రైతులు అరబెట్టుకున్నారు. మరికొంత మంది రైతులు పనలను కోసి చేలోనే వదిలేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆదివారం ఉదయం నుంచి ఏకధాటిగా ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షానికి రైతులు ఆవేదన చెంతున్నారు. రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. కోతలు కోస్తున్న రైతులు కూడా కోతలను ఆపి పంటను సంరక్షించుకోవడానికి నానాపాట్లు పడ్డారు. అందినకాడల్లా అప్పులు చేసి ప్రస్తుతం తొలకరి పంటను సాగు చేశామని పంట చేతికందే సమయంలో వర్షాలు పడితే అప్పుల పాలైపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో రెండు మూడు రోజులు వర్షాలు పడతాయని వాతావరణశాఖ వెల్లడించడంతో పాటు ఉదయం నుంచి వాతావరణం మబ్బులతో ఈదురు గాలులు, చినుకులు పండడంతో మరింత ఆందోళనకు గురవుతున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా పంటను వర్షాల బారి నుంచి కాపాడుకోవడానికి ప్రస్తుతం రైతులు నానా పాట్లు పడుతున్నారు.

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

ప్రభుత్వం వెంటనే స్పందించి తడిసిన ధాన్యాన్ని సీఎమ్మార్ రేటుకు కొనుగోలు చేయాలని రామచంద్రపురం వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. మండలంలోని పామర్రుతో పాటు పలు గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించి పంట పొలాలను పరిశీలించారు. రోడ్లపై ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించి రైతులను ఓదార్చారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను మరిన్ని పెంచాలన్నారు. తడిసిన ధాన్యంతో పాటు మొలకెత్తిన ధాన్యానికి కూడా మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలన్నారు. వాతావరణ పరిస్థితుల కారణంగా వర్షాలు పడే అవకాశం ఉందని రైతులు కోతలను వాయిదా వేసుకోవాలన్నారు. కోసిన ధాన్యాన్ని తడవకుండా భద్రపరచుకోవాలని సూచించారు. బీసీ నాయకులు పంపన సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు వాసంశెట్టి సూరిబాబు, సాదె కపిల్, చిల్లి నాగేశ్వరరావు, కుడుపూడి శ్రీనివాస్, చంద్రరావు, చెల్లుబోయిన శ్రీనివాస్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అకాల వర్షం

కాజులూరు: మండల గ్రామాల్లో ఆదివారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ విడవకుండా వర్షం పడటంతో మండల గ్రామాల్లో పలు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగి వైర్లు తెగిపోయాయి. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. స్థానికులు స్వచ్ఛందంగా రోడ్లపై విరిగిపడిన చెట్టుకొమ్మలను తొలగించుకుని మార్గాలను సరిచేయగా ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ స్తంభాలను, వైర్లను సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వర్షాల ప్రభావం జిల్లాలో మరో రెండు రోజుల పాటు తీవ్రంగా ఉంటుందని వాతావరణ నిపుణులు సూచిస్తున్న తరుణంలో మండల ప్రజలను మరితం భయాందోళనకు గురిచేస్తుంది. నియోజకవర్గ గ్రామాల్లో ఈ ఏడాది సుమారు 52 వేల ఎకరాల్లో రైతులు దాళ్వా సాగుచేశారు. కాజులూరు మండల గ్రామాల్లో సుమారు 50 శాతం పంట మాసూళ్లు నిర్వహించగా మిగిలిన పంట వివిధ దశల్లో ఉంది. గ్రామాల్లో కొందరు రైతులు వరి కుప్పలుగానూ, కొందరు మాసూళ్లు చేసిన ధాన్యాన్ని కళ్లాలపైన, రోడ్ల వెంబడి ఆరబెడుతున్నారు.



పామర్రులో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ తదితరులు



గొల్లపాలెంలో ఈదురుగాలులకు ఇంటిపై విరిగిపడిన చెట్టు



బందనపూడిలో మాసూళ్లు చేసి ఒడ్డుకు చేర్చిన ధాన్యం రాశులపై బరకాలతో కప్పుతున్న రైతులు



కపిలేశ్వరపురం మండలంలో రహదారిపై బరకాలతో కప్పి ఉంచిన ధాన్యం

అన్నదాతకు అకాల కష్టం

రాయవరం: వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా అకాల వర్షాలు చోటు చేసుకుంటున్నాయి. ఆదివారం ఉదయం ఒక్కసారిగా కారుమబ్బులు కమ్ముకోవడంతో పాటుగా, ఈదురుగాలులతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది.

రబీ పంటను కాపాడుకునేందుకు అన్నదాతలు ఉరుకులు..పరుగులు పెడుతున్నారు. తేమ శాతాన్ని తగ్గించుకునేందుకు రహదారులపై ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు రాశులుగా వేసిన దాన్యాన్ని తడవకుండా కాపాడుకునేందుకు కర్షకులు కష్టపడ్డారు. మండలంలో ఐదు మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ తెలిపారు. మండలంలో 70 శాతం మేర రబీ వరికోతలు పూర్తయినట్టు చెప్పారు.



రాయవరం మండలంలో వీస్తున్న ఈదురుగాలులు



ఆరబెట్టిన ధాన్యాన్ని రాశిగా చేస్తున్న కుటుంబ సభ్యులు



ధాన్యాన్ని రాశిగా చేస్తున్న అన్నదాత



బరకాలు కప్పుతూ ధాన్యాన్ని ఒబ్బిడి చేస్తున్న భార్యాభర్తలు

ధాన్యం కొనుగోళ్లలో దోపిడీ

- ఎంపీ బోస్
- పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తాం: జగ్గిరెడ్డి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ అధ్యక్షుడు జగ్గిరెడ్డి

రామచంద్రపురం: సూపర్ సిక్స్ అంటూ హామీలను ఇచ్చిన కూటమి ప్రభుత్వం ప్రస్తుతం జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లలో దోపిడీ జరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఎంపీ, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ ఆరోపించారు. పట్టణంలోని గాంధీపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆపార్టీ పీఏసీ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన జగ్గిరెడ్డిని ఎంపీ బోస్, కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్ నియోజకవర్గానికి చెందిన పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. సూర్యప్రకాశ్ అధ్యక్షతన జరిగిన పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధుల సమావేశంలో ఎంపీ బోస్ మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలను ఎంత సూపర్‌గా అమలు చేస్తున్నారో రాష్ట్ర ప్రజలకు అర్థం అయిందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజా సమస్యలను గాలికొదిలేస్తుందన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం: జగ్గిరెడ్డి

పార్టీ అభివృద్ధికి వెన్నుముకలా ఉండే కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా అరాచకపాలన చేస్తుందని, వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్లి వివరించాలన్నారు. రాబోయే కాలంలో పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాలపై ప్రజల తరపున పోరాడేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎంపీ బోస్, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తదితర పెద్దల సూచనలు, సలహాలతో పార్టీని ముందుకు నడిపించేందుకు కార్యకర్తలు సహకరించాలని కోరారు. కూటమి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తాను ముందు ఉంటానని హామీనిచ్చారు. ప్రజల తరఫున మనమందరూ కలసి పోరాటం చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. నియోకవర్గ కో ఆర్డినేటర్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు సూర్యప్రకాశ్ మాట్లాడుతూ పార్టీ తరఫున చేసే ప్రతి కార్యక్రమానికి నియోజకవర్గ పార్టీ కార్యకర్తలు, నాయకులు తోడుగా ఉంటామని చెప్పారు. అమలాపురం కో ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ మాట్లాడుతూ జగ్గిరెడ్డి అధ్యక్షతన పార్టీని బలోపేతం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. జిల్లా పార్టీ అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళి, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీలు అంబటి భవానీ, పంపన నాగమణి, చెల్లుబోయిన శ్రీనివాస్, నియోజకవర్గానికి చెందిన పార్టీ నేతలు, నాయకులు పాల్గొన్నారు.

అబద్ధాలతో ఎల్లకాలం మోసం చేయలేరు



పల్లిపాలెంలో బిల్లకుర్తి సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సూర్యప్రకాశ్ తదితరులు

కాజులూరు: కూటమి నాయకులు కల్లబొల్లి మాటలు చెబుతూ అబద్ధాలతో ప్రజలను ఎల్లకాలం మోసం చేయలేరని వైఎస్సార్ సీపీ యువజన విభాగం కోనసీమ జిల్లా అధ్యక్షుడు, పార్టీ రామచంద్రపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. మండలంలోని పల్లిపాలెంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు బిల్లకుర్తి సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులను ఆదివారం సూర్యప్రకాశ్ తదితర నాయకులు పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలో ఆయన కార్యకర్తలను కలుసుకుని ప్రజా సమస్యలపై చర్చించారు. ఆయన కార్యకర్తలతో మాట్లాడుతూ ఎన్నికల్లో సూపర్‌సిక్స్ పేరుతో తప్పుడు వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన టీడీపీ నాయకులు వాటిని అమలు చేయలేక అబద్ధాలు చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నారని వారికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ మేడిశెట్టి శ్రీను, మండల పార్టీ అధ్యక్షుడు పిల్లి కృష్ణమూర్తి, మండల బీసీ సెల్ కన్వీనర్ చొల్లంగి వెంకటరమణ, మాజీ సర్పంచ్ మట్టపర్తి నారాయణ, బిల్లకుర్తి కృష్ణారెడ్డి, చింతపల్లి ప్రసాద్‌రెడ్డి, కొల్లు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కపిలేశ్వరపురం: అంగరలో వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. యాదవ భక్త బృందం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన పూజా కార్యక్రమాల్లో భాగంగా తొలిరోజు స్వామి వారిని విశేషంగా అలంకరించారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు స్వామిని కీర్తిస్తూ భక్తి గీతాలను ఆలపించారు.

స్వామివారి కల్యాణోత్సవాలకు రాట ముహూర్తం

రాయవరం: మండలంలోని సోమేశ్వరంలో వేంచేసిన బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలకు ఆదివారం రాట ముహూర్తం నిర్వహించారు. ఈ నెల 8వ తేదీ రాత్రి 8 గంటలకు స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి పందిరి రాట చేశారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ రావుల రామకృష్ణ, స్థానిక నేతలు వైఆర్‌కే పరమహంస, శాఖా శ్రీనివాస్, చింతపల్లి వెంకటరమణ, జడ శ్రీనివాస్, కె.వెంకటరమణ, గుత్తుల వెంకన్న, అంబవరపు సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం



కైలాసభూమిని ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్

కె.గంగవరం: అధికారంలో ఉన్నా లేకపోయిన నిరంతరం ప్రజల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తామని జిల్లా యువజన అధ్యక్షుడు, రామచంద్రపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. మండలంలోని పామర్రులో సుమారు రూ.25 లక్షల ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ నిధులతో నిర్మించిన కైలాస భూమిని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కె.గంగవరం మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. భవిష్యత్‌లో అధికారం చేపడితే తప్పకుండా అన్ని గ్రామాల్లో శ్మశాన వాటికలను నిర్మిస్తామని చెప్పారు. ప్రస్తుతం పామర్రు గ్రామంలో ప్రధాన సమస్యగా ఉన్న కైలాస భూమి నిర్మాణంలో ఎంపీ నిధులతో పాటు గ్రామస్తుల విరాళాలు కూడా ఉన్నాయన్నారు. దీంతో పాటు గ్రామానికి చెందిన దాతలు స్థలాన్ని కూడా అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వం అన్ని కార్యక్రమాలు చేయలేదని దాతలు కూడా తగిన ప్రోత్సాహం ఇస్తే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు వాసంశెట్టి సూరిబాబు, సాదె కపిల్, కూళ్ల సర్పంచ్ చిల్లి నాగేశ్వరరావు, కుడుపూడి శ్రీనివాస్, కుడుపూడి చంద్రరావు, వశిష్టమూర్తి, నున్నా సత్యనారాయణ, పెన్నాడ త్రిమూర్తులు, చెల్లుబోయిన శ్రీనివాసరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాఠశాల టాపర్లకి సత్కారం

రామచంద్రపురం రూరల్: మండలంలోని నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతిలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయిని కేకేఎల్ కుమారి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ప్రథమ స్థానం సాధించిన పంపన యామిని అనంత శ్రీలక్ష్మి, ద్వితీయ స్థానంలో నిలిచిన దువ్వ దుర్గ, తృతీయ స్థానం సాధించిన నరాల అనూషలను వారి తల్లిదండ్రులను దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

విద్యకు అధిక ప్రాధాన్యం



ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి సుభాష్

రామచంద్రపురం: కూటమి, కేంద్ర ప్రభుత్వం సంయుక్తంగా విద్యకు అత్యధిక ప్రాముఖ్యత ఇస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు తరగతుల నిర్మాణానికి ప్రధానమంత్రి ఉషా పథకం కింద మంజూరైన రూ.4.10 కోట్లతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి మంత్రి సుభాష్ ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం సర్వారాయ సుగర్స్ (చెల్లూరు) మంజూరు చేసిన రూ.10 లక్షల సీఎస్సార్ నిధులతో ఏర్పాటు చేసిన ఫర్నిచర్‌ను మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ప్రధానమంత్రి ఉషా పథకం కింద రాష్ట్రంలో మొత్తం 19 కళాశాలలకు నిధులు మంజూరు చేశారన్నారు. కళాశాలలో విద్యార్థులు, గ్రామీణ విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రభుత్వం ఈ నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ నిధుల ద్వారా 13 అదనపు తరగతుల నిర్మాణం పూర్తవుతుందన్నారు. తద్వారా విద్యార్థులకు మెరుగైన విద్యా ప్రమాణాలు అందించే అవకాశం కలుగుతుందన్నారు. విద్యకు సంబంధించి ఎలాంటి సహకారం అవసరమైన చేయడానికి తాను ఎప్పుడూ ముందుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రామకృష్ణ, కళాశాల సిబ్బంది, వార్డు కౌన్సిలర్, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.